

జిల్లాకు 75 ఏళ్లు

● 13 నుంచి వేడుకలు

శ్రీకాకుళం జూలై 30(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. '13న శోభాయాత్ర, 14న సంప్రదాయ క్రీడలు, రచన, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సత్కారాలు, 15న స్వాతంత్ర్య వేడుకలు జరగనున్నాయి. జాతీయ పతాక ఆవిష్కరణతో పాటు జిల్లా 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రసంగాలు ఉంటాయి. అరసవల్లి దేవాలయం, రైల్వేస్టేషన్, జాతీయ రహదారి-16 జంక్షన్ల వద్ద ప్రత్యేక లైటింగ్, పుష్పాలంకరణ ఏర్పాటు చేస్తామని' కలెక్టర్ తెలిపారు.

సాగునీరేదీ?



చుక్క నీరులేని తోటపల్లి కాలువ



● ప్రధాన కాలువకే పరిమితమైన 'తోటపల్లి'
● పిల్ల కాలువలు లేక పూర్తిస్థాయిలో అందని నీరు
● మూడు మండలాల రైతులకు తప్పని వెతలు

రణస్థలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి)

ఎచ్చెర్ల నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతం. కనీస స్థాయిలో కూడా సాగునీటి వనరులు లేవు. ఈ పరిస్థితుల్లో గత టీడీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువను జి.సిగడాం, లావేరు మీదుగా రణస్థలం మండలానికి విస్తరించింది. ఈ మూడు మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ కాలువ విస్తరణ జరిగింది. దీంతో కొంతవరకు సాగునీటి అవసరాలు తీరాయి. కానీ, పిల్ల కాలువల అనుసంధానం పనులు జరగకపోవడంతో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తోటపల్లి కాలువపై అంతులేని నిర్లక్ష్యం కొనసాగింది. శివారు ఆయకట్టుగా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గానికి నీరు వచ్చిందా? లేదా? అని గత పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా తోటపల్లి పిల్లకాలువలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనివల్ల ఈ ఖరీఫ్‌కు కూడా పూర్తిస్థాయి సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. వచ్చే ఖరీఫ్ నాటికైనా పిల్ల కాలువల పనులు పూర్తి చేయడంపై ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దృష్టిపెట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ముందుకు కదలని పనులు..

తోటపల్లి కాలువకు సంబంధించి రణస్థలం మండలంలో 21,590 ఎకరాలు, లావేరులో 11,008, జి.సిగడాం మండలంలో 6,373 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. కానీ, అందులో సగం కూడా నీరు అందించలేని స్థితిలో కాలువ ఉంది. పిల్ల కాలువల నిర్మాణానికి ముందుగా భూసేకరణ చేయాలి. రణస్థలం మండలంలో 60 కిలోమీటర్ల పిల్ల కాలువల నిర్మాణానికి 52 ఎకరాలను సేకరించాల్సి ఉంది. లావేరు మండలంలో 6.7 కిలోమీటర్ల పిల్లకాలువలకుగాను 6.41 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. పరిహారం చెల్లించేందుకు రూ.19 కోట్లు సిద్ధంగా ఉంది. కానీ, ఎందుకో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. లావేరు, గురుగుబిల్లి, బెజ్జిపురం, శిగిరికొత్తపల్లి తదితర గ్రామాల్లో పిల్ల కాలువలు తవ్వినప్పటికీ చుక్క నీరు పారడం లేదు. దీంతో కాలువల్లో (మిగతా 6వ పేజీలో..)



తోటపల్లి కాలువ

బోధనలో కొత్తదనం

● ఉపాధ్యాయులకు కరదీపికలు పంపిణీ
● విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి
● సింగిల్ టీచర్లపై పెరిగిన భారం



నరసన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక (టీచర్ హ్యాండ్ బుక్స్)లను అందిస్తుంది. ఎస్‌సీఈఆర్టీ సహకారంతో సమగ్రశిక్ష ద్వారా సామర్థ్య ఆధారిత బోధన, అభ్యాసన ఉపాధ్యాయ వనరుల పేరుతో వీటిని రూపొందించింది. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, విద్యాప్రమాణాలు పెంచేలా ఇవి రూపుదిద్దుకున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలలకు కరదీపికలను అధికారులు పంపిణీ చేశారు.

అకడమిక్ క్యాలెండర్‌తో అనుసంధానం..

కరదీపికలను అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో విద్యాశాఖ అధికారులు అనుసంధానం చేశారు. ఏ రోజు.. ఏ పాఠం, ఏ అంశం ఎలా చెప్పాలో తేదీలతో సహా అందులో పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకే రోజు ఒకే పాఠం బోధనలో ఉంటుంది. పాఠం పూర్తయిన తరువాత ప్రతి పీరియడ్‌లో బోధనా సమయం, ఉపయోగించిన టీఎల్ఎం, అభ్యసన కృత్యాలు, రిమార్కులను ఉపాధ్యాయులు కరదీపికలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా తరగతుల్లో సబ్జెక్టుకు సంబంధించిన ఓ పుస్తకం ఉంటుంది. ఈ పుస్తకాలను తొలుత ఉపాధ్యాయులు క్షుణ్ణంగా చదవాల్సి ఉంటుంది. దీని ద్వారా పిల్లలకు సులభతరంగా బోధన (మిగతా 6వ పేజీలో..)



'ఉపాధి'లో మాయాజాలానికి చెక్

● నిబంధనలు కఠినతరం
● పని ప్రదేశంలో రెండు విడతల హాజరు నమోదు
● శ్రామికుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్

6లో

రహదారుల భద్రతపై నిర్లక్ష్యం వద్దు

● బ్లాక్ స్పాట్లు, కెమెరాలు, వైద్య సేవలపై దృష్టి
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో

మా ఊరు పేరు మార్చండి

● పెంట గ్రామస్థుల వినతి

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● పలాస రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం అలోక్‌త్రిపాఠి

పలాస, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ మేనేజర్ అలోక్‌త్రిపాఠి అన్నారు. డీఆర్ఎంగా ఆయన రెండు రోజుల కిందట బాధ్యతలు స్వీకరించారు. మొదటి పర్యటనలో భాగంగా పలాస రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆధునికీకరణ పనులు పరిశీలించారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు కేంద్రం రూ.25 కోట్ల మేర నిధులు విడుదల చేసింది. ఈ పనులను డీఆర్ఎం పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. టిక్కెట్ కౌంటర్ ఉన్న ప్రాంతంలో పూర్తిస్థాయి రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న స్టేషన్ మేనేజర్ కార్యాలయం, విశ్రాంతి మందిరం, టిక్కెట్ కార్యాలయం, ప్లాట్‌ఫారమ్‌ను ఆయన పరిశీలించారు. డివిజన్ అధికారులతో పాటు పలాస రైల్వేస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అధికారులతో కలసి పర్యటిస్తున్న డీఆర్ఎం అలోక్‌త్రిపాఠి



నిలిచిన పనులు

ఎప్పటికి పూర్తవుతుందో?

● నిలిచిన కోడిరామ్మూర్తి స్టేడియం పనులు
● మంత్రి ఆదేశించినా ఫలితం శూన్యం ● క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కోడిరామ్మూర్తి(కేఆర్) స్టేడియం పునర్నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ఏడాది జూలైలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్.. కేఆర్ స్టేడియం పనులు పరిశీలించి ఏడాదిలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అయితే, ఏడాది పూర్తవుతున్నా పనులు పూర్తికాలేదు కదా నిర్మాణం ఆగిపోయింది. నిధుల లేమి దీనికి కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం 60 శాతం మేర పనులు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

రూ. 12 కోట్లతో పనులకు శ్రీకారం

కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణానికి 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికోసం రూ.12 కోట్లు కేటాయించింది. ఆ వెంటనే స్టేడియం చుట్టు ఉన్న గ్యాలరీ, ఇండోర్ స్టేడియం, కార్యాలయం నేలమట్టం చేసి పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది. తొలుత ఈ పనులు శరవేగంగా జరిగాయి. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేఆర్ స్టేడియాన్ని నిర్లక్ష్యం చేసింది. నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్టేడియం నిర్మాణంపై దృష్టి సారించింది. గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లు, ఇండోర్ (మిగతా 6వ పేజీలో..)

పుచ్చుపోయి.. పురుగుపట్టి

● అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కందిపప్పు సరఫరా
● కానరాని అధికారుల తనిఖీలు
● లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు



ఇచ్ఛాపురంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన నాణ్యత లేని కందిపప్పు

ఇచ్ఛాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నిత్యావసరాల సరుకుల్లో నాణ్యత కొరవడుతుంది. పౌర సరఫరాల స్టాక్ పాయింట్ల నుంచి పుచ్చుపోయిన, పురుగు పట్టిన కంది పప్పును అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాంగం నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం తదితర కారణాలతో నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాల్లో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 3,385 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 6,020 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు 18,422 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా 3 కిలోల బియ్యం, నూనె అర కిలో, కంది పప్పు కిలోను అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తుంటారు. ఈ సరుకులను ఓ సంస్థ సరఫరా చేస్తోంది. వీటినే అంగన్‌వాడీ కేంద్రాల్లో వండి పిల్లలకు పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనం పెడుతుంటారు. అయితే, బియ్యం, నూనె బాగుంటున్నా కందిపప్పు మాత్రం నాసిరకంగా ఉంటుందని గర్భిణులు, బాలింతలు చెబుతున్నారు. పురుగులతో పాటు ఎక్కువ పుచ్చులు ఉంటున్నాయని, సరిగ్గా ఉడకడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో దాన్ని వినియోగించడం లేదని అంటున్నారు. పప్పు పురుగు పట్టడంతో వాటిని శుభ్రపరచటానికి అంగన్‌వాడీ ఆయాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పప్పు ఉడకపోవడంతో పాటు రుచిగా ఉండడం లేదని, దీనివల్ల పిల్లలు తినడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

తనిఖీలేవీ?

జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, జలుమూరు, జి.సిగడాం, ఇచ్ఛాపురం, కంచిలి, కోటబొమ్మాళి, కొత్తూరు, లావేరు, మెళియాపుట్టి, పలాస, సరుబుజ్జిలి, టెక్కలిలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడకు వచ్చిన కందిపప్పుతో పాటు ఇతర నిత్యావసరాలను విధిగా అధికారులు తనిఖీ చేయాలి. బాగుంటేనే అంగన్‌వాడీ (మిగతా 6వ పేజీలో..)

ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం

● కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి
● జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు



మాట్లాడుతున్న నాగబాబు

శ్రీకాకుళం/క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం, ప్రాధాన్యం ఇస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన నాయకులు, కార్యకర్తలతో శ్రీకాకుళంలో బుధవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు, కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన, క్షేత్రస్థాయిలో వాస్తవాలను అభిప్రాయాలుగా తెలుసుకున్నారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో చాలా సంతృప్తి ఉందని స్పష్టమైందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపడుతున్న అభివృద్ధి (మిగతా 6వ పేజీలో..)



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద బైఠాయించిన ఏఎన్ఎంలు

పదోన్నతుల్లో ఎందుకింత జాప్యం?

● ప్రభుత్వ ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తే ఎలా?
● మాకు న్యాయం చేయండి ● డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏఎన్ఎంల బైఠాయింపు

అరసవల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల్లో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారి పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరులోనే పదోన్నతులపై జీవో విడుదల చేసింది. ఆ జీవోను అనుసరించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించి నాలుగు నెలలు కావస్తోంది. కానీ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఇంతవరకు ఎటువంటి పదోన్నతులు కల్పించలేదు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కనీసం లిస్టు కూడా తయారుకాలేదు. పదోన్నతులు కల్పించకుండానే ఏఎన్ఎంలకు బదిలీలు కూడా (మిగతా 6వ పేజీలో..)

స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు

పీఎంశ్రీ పాఠశాలలకు రూ.25వేలు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



నరసన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరు 5న జిల్లాలో 17 పీఎంశ్రీ పాఠశాలలను ప్రారంభించింది. ఈ పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు ప్రభుత్వం రూ.25వేల చొప్పున నిధులను మంజూరు చేసింది. జాతీయ జెండా, సౌండ్ సిస్టంకు రూ.5వేలు, విద్యార్థుల ఆటల పోటీల నిర్వహణకు రూ.5వేలు, చారిత్రక ఘటనలపై స్కిట్ల ప్రదర్శనకు రూ.3వేలు, వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలకు రూ.5వేలు, పోస్టర్ తయారీ, సామగ్రి, బహుమతులు, స్వీట్లు ఇతర ఖర్చులకు రూ.7వేలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.



ఉపాధిలో మాయాజాలానికి చెక్

- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో రెండు విడతల హాజరు నమోదు
- శ్రామికుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్

అమలు తీరు ఇలా...

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ... ఎంపీడీఓలకు నివేదిక అందజేయాలి. ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు చెక్ చేయాలి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వచ్చిన ఫొటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి. క్షేత్ర స్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు. జిల్లా కార్యాలయాల్లో ప్రతి ఫొటోను జాగ్రత్తగా భద్రపరచాలి. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ యాప్ ద్వారా ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. శ్రామికులకు వేతనం రావాలంటే ఏ పూటకాపూట ఫొటోలు తీసుకోవాల్సిందే. లేదంటే ఆరోజు వేతనం రానట్టే.

టెక్కలి రూరల్/కోటబొమ్మాళి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో మస్టర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఉదయం ఓ ఫొటోతీసి.. వెళ్లిపోయి పని చేసినట్టు చూపడం ఇక కుదరదు. దీని కోసం ప్రభుత్వం నేషనల్ మొబైల్‌మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను తీసుకువచ్చింది. దొంగ మస్టర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పనులకు సంబంధించి మస్టర్లలో నమోదు చేసిన శ్రామికులకు పని చేసే చోట రెండు పర్యాయాలు ఫొటోలు తీసి.. ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఉదయం పనికి రాగానే ఒకసారి.. సాయంత్రం నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటోలు తీసి... వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. శ్రామికులకు వేతన చెల్లింపులకు ఫొటోలు తప్పనిసరి. ఏరోజుకారోజే పనికి హాజరైన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్‌లోడ్ సమస్యలు ఉంటే ఫొటోలను రాత్రి 12 గంటల లోపు చేయాలి. మాన్యువల్ మస్టర్ అప్రూవల్‌కు సరైన కారణం ఎంపిక చేయాలి. ఒకరోజుకు సంబంధించిన ఫొటోలు తరువాతి రోజు అప్‌లోడ్ చేయడానికి వీలు పడదు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో ప్రస్తుతం ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్న వారు 3.84 లక్షల మంది ఉన్నారు. వీరిలో 6.18 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. పనులకు మాత్రం 1.14లక్షల మంది హాజరవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్టర్లు వేసి.. భారీగా సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది జాబ్‌కార్డుల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త విధానం వల్ల ఇలాంటి అక్రమాలకు చెక్ పడుతుందని భావిస్తున్నారు.

రెండు పూటలా ఫొటోలు తీయాలి..

పనులు చేస్తున్నా సమయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు రెండు పూటలా మస్టర్లు వేసి.. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఆగస్టు 7 నుంచి ఇలా చేస్తేనే వేతనాలు అందుతాయి. గతంలో ఒక పూట పనులకు వెళ్లి రెండు పూటలా పని చేసినట్టు వేతనాలు తీసుకున్నారనే ఫిర్యాదులు కేంద్ర ప్రభుత్వానికి వెళ్లాయి. దీంతో రెండు పూటలా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే వేతనం వచ్చే పరిస్థితి ఉంటుంది.

-నరసింహప్రసాద్ పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



నరసింపురం వద్ద వేతనదారులకు ఫొటోలు తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్



కొత్తమ్మతల్లికి గాజులతో అలంకరించిన దృశ్యం

కొత్తమ్మతల్లికి గాజులతో అలంకరణ

కోటబొమ్మాళి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని శ్రావణ మాసం సందర్భంగా బుధవారం గాజులతో అలంకరించారు. అర్చకుడు కమ్మకట్టు రాజేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గురు, శుక్రవారం రెండు రోజులు కొత్తమ్మతల్లి గాజులమ్మ తల్లిగా భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతపై నిర్లక్ష్యం వద్దు

- బ్లాక్ స్పాట్లు, వైద్య సేవలపై దృష్టి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతపై నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు స్పష్టం చేశారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కెవి. మహేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు రక్షించాలంటే రహదారులు సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. సాధారణ వర్షాలకే జాతీయ రహదారిపై నీరు నిలుస్తోందని.. వాహనదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా పలాస వద్ద రహదారిని పరిశీలించానని... సర్వీసు రోడ్ల నిర్వహణ దయనీయంగా ఉందని అన్నారు. జాతీయ రహదారుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పైడిభీమవరం పారిశ్రామికవాడ రహదారి ప్రాంతాన్ని పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రధాన రహదారులపై డివైడర్లను చీల్చి అక్రమంగా వాహనాల రాకపోకలకు మార్గం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే తక్షణ వైద్యసేవలు అందేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మలుపుల వద్ద బారికేడ్లు, స్టాపర్లు, ప్రమాద సంకేత బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు.

సీసీ కెమెరాలు కీలకం..

ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి అన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కొన్ని చోట్ల కెమెరాలు పని చేయడం లేదని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. 2023లో 810 ప్రమాదాలు, 297 మరణాలు సంభవించాయని.. 529 మంది గాయపడ్డారని తెలిపారు. 2024లో 610 ప్రమాదాలు, 279 మరణాలు సంభవించాయని, 902 గాయపడ్డారని తెలిపారు. 2025 జూలై వరకు 497 ప్రమాదాలు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో మరణాలు మాత్రం 153, గాయపడిన వారి సంఖ్య 409గా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ పి.సత్యనారాయణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయసారథి, ఎన్‌హెచ్ఏఐ పీడీ తివారీ, డీపీఓ భారతీ సౌజన్య, డీఎస్పీ సీహెచ్.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

మా ఊరు పేరు మార్చండి

- పెంట గ్రామస్థుల వినతి



గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డు



పెంట గ్రామం

జి.సిగడాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'పెంట' గ్రామం పేరు మార్చాలని గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తమ గ్రామం పేరు పెంట అని ఉచ్ఛరించటానికి ఎబ్బెట్టుగా ఉందని.. అధికారులకు చెప్పేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల వారు తమ గ్రామం పేరు చెబితే హేళనగా, చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు తమ గ్రామంలోని యువతీ, యువకులు ఎంపికవుతూ.. గ్రామానికి మంచి పేరు తెస్తున్నారని తెలిపారు. వీరు కూడా బయట పేరు చెప్పడానికి ఇబ్బంది పడకుండా.. పెంట గ్రామం పేరు మార్చాలని వారు కోరారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు చొరవ తీసుకొని తమ గ్రామం పేరు మారేలా చర్యలు తీసుకోవాలని పెంట గ్రామ యువకులు, పెద్దలు కోరుతున్నారు.



కోటబొమ్మాళిలో సిద్ధమవుతున్న వినాయకులు

గణపయ్యలు సిద్ధం

కోటబొమ్మాళి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ప్రతిఊరిలో ఘనంగా నిర్వహించుకునే ఈ పండగను ఒకరిని మించి మరొకరు మిన్నగా చేసేందుకు పోటీ పడుతుంటారు. ముఖ్యంగా యువత, పార్టీల నాయకులు భారీ విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తారు. ఎవరు ఎంత ఎక్కువ ఎత్తు విగ్రహం పెడితే వారు అంత బాగా వేడుకలు చేస్తున్నట్టు అంతా భావిస్తారు. ఆగస్టు 27న వినాయకచవితి కావడంతో కోటబొమ్మాళి మండల కేంద్రంలో గణేశుని విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఇక్కడ రూ.500 నుంచి రూ.30వేల విలువైన విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే అనేక మంది అడ్వాన్సులు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

పదోన్నతుల్లో ఎందుకింత జాప్యం?

(ఐదో పేజీ తరువాయి)

చేసేశారు. మిగతా జిల్లాల్లో తొలుత పదోన్నతులు కల్పించి, అనంతరం బదిలీలు నిర్వహించారు. కానీ, జిల్లాలోని పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఇప్పటివరకు కనీసం లిస్టు కూడా తయారు చేయకపోవడం ఏమిటని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాకుళం జిల్లా లోనే ఎందుకింత జాప్యం జరుగుతుందో అర్థం కావడం లేదని ఏఎన్ఎంలు వాపోతున్నారు. గతేడాది అక్టోబరు 22 నాటికే అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, సీనియారిటీ ప్రకారం తుది జాబితాను ప్రకటించాల్సి ఉంది. కానీ, ఇంతవరకు జాబితాలను కూడా తయారు చేయలేదు. వెంటనే తమను గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని వారు కోరుతున్నారు. పదోన్నతుల విషయమై ఏఎన్ఎంలు పెద్ద ఎత్తున బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి చేరుకుని డీఎంహెచ్‌వోను కలిసేందుకు వేచి చూశారు. కార్యాలయం మొదటి అంతస్తులో వారు బైఠాయించారు. కానీ, డీఎంహెచ్‌వో అందుబాటులో లేకపోవడంతో చివరకు కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఎన్నో సార్లు అధికారులను కలిశామని, ప్రతీసారి ప్రమోషన్లు ఇచ్చేస్తామని చెబుతూ వాయిదాలు వేస్తున్నారే తప్ప పట్టించుకునే వారే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 150 ఖాళీలు ఉన్నాయని, ర్యాంకుల ఆధారంగా తమకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. ఏఎన్ఎంలు టి.మోహినమ్మ, కె.ధనలక్ష్మి, ఎం.ఝాన్సీదేవి పాల్గొన్నారు.

సాగునీరేదీ?

(ఐదో పేజీ తరువాయి)

పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. తోటపల్లి భూసేకరణ అధికారుల మధ్య సమన్వయలోపమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. గత ఏడాది తోటపల్లి కాలువ పక్కనే ఉన్న వేల్పురాయి, దేవరాపల్లి, కమ్మసిగడాం, అర్జునవలస, పున్నసపాలెం తదితర గ్రామాలకు చుక్కనీరు అందలేదు. పైడిభీమవరం, దేరసాం పిసిని, నారువ తదితర గ్రామాలకు పిల్ల కాలువలు తవ్వలేదు. దీంతో నీరు అందక అవస్థలు తప్పలేదు

ఇబ్బందులు తప్పడం లేదు..

పేరుకే తోటపల్లి కాలువ ఉంది. కానీ, నిత్యం సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన కాలువ ఉన్నా పిల్ల కాలువలు లేవు. దీంతో నీరు అందడం లేదు. వర్షాకాలంలో మాత్రమే..అది కూడా భారీ వరదలు వచ్చే సమయంలోనే కాలువలో నీరు పారుతోంది. లేకుంటే మాత్రం నీరు లేకుండా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి కాలువను ఆధునీకరించాలి. శివారు ఆయకట్టుకు సాగునీరు అందించాలి.

-మీసాల రామారావు, రైతు, రణస్థలం మండలం

పిల్ల కాలువలు నిర్మించాలి..

ఎచ్చెర్ల నియోజకవర్గానికి తోటపల్లి కాలువ రావడంతో సంబరపడిపోయాం. కానీ, ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యం కొనసాగింది. పిల్ల కాలువలను నిర్మించడంలో జగన్ సర్కారు విఫలమైంది. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నాం. కనీసం వచ్చే ఏడాదైనా పిల్ల కాలువల నిర్మాణం పూర్తిచేయాలి.

-బాడిత రాంబాబు రైతు, గురుగుబిల్లి, లావేరు మండలం

ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

పనుల ద్వారా రాష్ట్రానికి, కూటమి ప్రభుత్వానికి గౌరవం పెరుగుతోందని వెల్లడించారు. కొద్ది రోజులు అటూ ఇటూ అయినా.. పార్టీ కోసం శ్రమించిన వాళ్లందరికీ పదవులు లభిస్తాయని చెప్పారు. పవన్‌కల్యాణ్ వంటి నాయకుడే పదేళ్ల పాటు ఏవిధమైన పదవులు ఆశించకుండా ప్రజాక్షేత్రంలో పని చేసిన విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పదవుల కేటాయింపుపై పవన్‌కల్యాణ్ చూసుకుంటారని వివరించారు. ఇకపై ఉత్తరాంధ్రలో జనసేన పార్టీ ఎదుగుదల కోసం అధిక సమయం కేటాయించి పనిచేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో వార్డు స్థాయి, బూత్‌స్థాయి నాయకులతో, కార్యకర్తలతో సమావేశం అవుతానని స్పష్టంచేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకుని రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పేడాడ రామ్మోహన్, గేదెల చైతన్య, దాసరి రాజు, విశ్వక్సేన్, వి.దుర్గారావు, కణితి కిరణ్‌కుమార్, బలగ ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యాపారులతో చర్చిస్తున్న జోనల్ మేనేజర్ మురళీమోహన్

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

పలాస, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంగిలిగాం పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పారిశ్రామిక వాడలో సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన వ్యాపారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్ఎం మాట్లాడుతూ పారిశ్రామికవాడ చుట్టూ గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్, కాలువ మరమ్మతులు,కొత్త విద్యుత్ దీపాలు వేస్తామన్నారు. వ్యాపారులు మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకూ చేసిన పనులు, ఖర్చు, మిగిలిన డబ్బులు ఎవరి ఖాతాల్లో ఉన్నాయని ప్రశ్నించారు దీనిపై వ్యాపారులకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ కమిషనర్ జయచంద్ర, వ్యాపార సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి వినయ్ పాల్గొన్నారు.

బోధనలో కొత్తదనం

(ఐదో పేజీ తరువాయి)

అందించేందుకు నోట్స్, ప్రశ్న పత్రాలను తయారు చేసుకునేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏకోపాధ్యాయులపై భారం..

ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించే ఏకోపాధ్యాయులపై కరదీపికలు మరింత భారం కానున్నాయి. ఐదు తరగతులకుమొత్తం 18 కరదీపికలను అధికారులు పంపిణీ చేశారు. అయితే, కరదీపికలో సూచించిన మాడ్యూల్ విధానంలో ఒకే రోజు ఐదు తరగతులకు బోధించడం తమవల్ల సాధ్యంకాదని ఏకోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన తరువాత విద్యార్థుల హాజరు, ఎండీఎం భోజనాల ఫొటోలను యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాలని, ఎమ్మార్సీ నుంచి వచ్చే మార్గదర్శకాలను పాటించాలని, మరోకవైపు బోధన చేపట్టాల్సి ఉంటుందని వారు అంటున్నారు. ఇప్పుడు కరదీపికలో సూచించిన మాడ్యూల్ విధానంలో బోధన అంటే తమపై మరింత భారం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 800 పైగా సింగిల్ ఉపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

పుచ్చుపోయి.. పురుగు పట్టి

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాలకు అందించాలి. కానీ, జిల్లాలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకసారి నాణ్యతలేని కందిపప్పు లారీల్లో స్టాక్ పాయింట్లకు వచ్చింది. దీన్ని అధికారులు తనిఖీ చేసి తిప్పి పంపారు. అనంతరం నాణ్యమైన కందిపప్పును తీసుకువచ్చారు. దీంతో కొద్దినెలల పాటు నాణ్యమైన పప్పును అంగన్‌వాడీ కేంద్రాలకు అందించారు. తరువాత అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ కరువు అవడంతో పుచ్చు కందిపప్పు సరఫరా అవుతోంది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత లేకుంటే చర్యలు..

అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. సిబ్బందిని క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేస్తున్నాం. ఆహారంలో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. ఎక్కడైనా నాసిరకం అనితేలితే వాటిని తిప్పి పంపుతున్నాం.

-శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

ఎప్పటికి పూర్తవుతుందో?

(ఐదో పేజీ తరువాయి)

స్టేడియం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు గతేడాది జూలైలో అధికారులను ఆదేశించారు. అప్పటి నుంచి రూ.2.89 కోట్ల విలువైన పనులు చకచకా జరిగాయి. ఈ బిల్లు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటికైనా స్టేడియ పనులు పూర్తిచేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

కూటమితోనే సుపరిపాలన సాధ్యం

రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యేలు అన్నారు. బుధవారం వివిధ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలిచ్చి పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు.

రాష్ట్రంలో అభివృద్ధి శకం: ఎమ్మెల్యే శంకర్


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి శకం ప్రారంభమైందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం శిలగాం సింగువలస గ్రామంలో నిర్వహించారు. స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచు దశరథుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన ధర్మాన పద్మకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.40 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.


మెళియాపుట్టి: గొప్పిలిలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హామీలను అమలు చేస్తున్నాం

మెళియాపుట్టి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభు త్వం అమలు చేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. బుధవారం గొప్పిలి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాన మోహనరావు, నంబాల వెంకటరావు, బి.దినకరావు, అనపాన రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: మెట్టూరులో అవగాహన కల్పిస్తున్న కలమట

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

హరిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు బుధవారం మందస మండలం బెల్లుపటియా గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, పీరుకట్ల విఠల్, తమిరి భాస్కరరావు, దాసరి తాతారావు తదితరులుపాల్గొన్నారు.

ప్రజల మెప్పు పొందిన పాలన

కొత్తూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజల మెప్పును పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. బుధవారం మెట్టూరు గ్రామంలో సువరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐర్రి గోవిందరావు, కొవ్వల రామకృష్ణ, యోగి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఒక వరం

అరసవల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధ వారం విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో రూ.2,54,406 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు పథకాలందాలి



శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చూడడమే లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి జాతీయ బృందం సభ్యులు సుసీల్ బంటా, నాథూసింగ్ అన్నారు. జిల్లాలో కేంద్ర పథకాల అమలుపై కలెక్టర్ కార్యాలయ సమా వేశ మందిరంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, పీడీలు కిరణ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఆదేశాలతో భూ సర్వే

జి.సిగడాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సర్వే నెంబరు 92/8లోని భూమిని కొంత మంది ఆక్రమించి కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారని, సర్వే చేపట్టి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పి.జగదీశ్వరరావు ఇటీవల లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారి ఆదేశాలతో బుధవారం విజయనగరం, శ్రీకాకుళం సర్వే ఏడీలు కె.రమణమూర్తి, కె.రమేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సర్వేయర్లు భూ సర్వే చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు.

మాంసం వ్యర్థాలు ఊరికి దూరంగా వేయాలి

ఇచ్ఛాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చికెన్, మటన్ వ్యాపారులు మాంసం వ్యర్థాలను ఊరికి దూరంగా వేయాలని ముస్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మాంసం విక్రేతలతో కోర్టు ఆవరణలో మునిసిపల్ కమిషనర్ రమేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాలను మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద నిర్దేశించిన ప్రదేశంలో వేయాలన్నారు. రోడ్లపై ఆవులు విడిచిపెట్టిన యజమానులకు హెచ్చరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

త్వరలో సెంటర్ లైటింగ్


సెంటర్ లైటింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్ వద్ద త్వరలోనే సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు సుడా ఎస్ఈ పి.సుగుణాకరరావు అన్నారు. బుధవారం కమిషనర్ ఎన్.రమేష్‌తో కలిసి సెంటర్ డివైడర్‌ను పరిశీలించారు. సెంటర్ లైటింగ్, డివైడర్‌ను మెరుగుపరిచేం దుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలకు దరఖాస్తులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సు ఉద్యోగాలకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఆగస్టు 7వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు 24 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి, జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.2.40 లక్షల నుంచి రూ.3.10 లక్షల జీతం చెల్లిస్తారని, అలాగే ఉచిత భోజన, వసతి, వీసా, రవాణా సౌకర్యం, వైద్య సదుపాయాలు కల్పిస్తారన్నారు. ఒక్కసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన టిక్కెట్లు కూడా ఏర్పాటు చేస్తారన్నారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు డీఆర్‌డీఏ కాంప్లెక్స్ ప్రాంగణం లోని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

రైతులకు మేలు చేసేలా పాటుపడాలి: ఎమ్మెల్యే అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు ద్వారా రైతులకు మేలు చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. గొర్లెపాడు వద్ద బుధవారం ఇచ్ఛాపురం మార్కెట్ యార్డు ఛైర్మన్ మణిచంద్రప్రకాష్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని యత్నిస్తోందన్నారు. ఈ మేరకు మార్కెట్ యార్డు ద్వారా ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కల్పించేందుకు కార్యవర్గం ప్రయత్నించాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో ఛైర్మన్ మణిచంద్రప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాసరౌళో, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, బాసుదేవ్ రౌళో, బి.చిన్నబాబు, బి.రమేష్, పి.కృష్ణారావు, బాసుదేవ్ ప్రధాన్, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట కూటమి నేతలు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారంపై హర్షం

కంచిలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కంచిలి పంచాయతీ పెద్ద పాత్రపడ గ్రామంలో నీటి సమస్య పరిష్కారంపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. చాలా రోజులుగా ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి సమస్య ను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అశోక్‌ను బుధవారం రామయ్యపుట్టుగలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

ఏకీకృత నెట్ వర్కింగ్‌తో ప్రయోజనం


వల్లీకుమారిని సత్కరిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీలో అన్ని విభాగాలకు ఏకీకృత నెట్‌వర్కింగ్ ఏర్పాటుతో ప్రయోజనమని ఏయూ సైబర్ సెక్యూరిటీ సెంటర్ సమన్వయకర్త, సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.వల్లీకుమారి అన్నారు. వర్సిటీని బుధవారం ఆమె సందర్శించారు. కంప్యూటర్ నెట్ వర్కింగ్‌లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఇంజ నీరింగ్ కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, స్పెషలాఫీసర్ డాక్టర్ స్వామ్రాజ్యలక్ష్మి, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.

సీఎం ముఖ్య కార్యదర్శిని కలిసిన లక్ష్మీదేవి



అరసవల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం వచ్చిన సందర్భంగా ఆయన స్వగృహంలో కలిసి వివిధ అంశాలను చర్చించారు.

నగరంలో రూ. 4.5 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్

శ్రీకాకుళం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడు ప్రధాన నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. ఇందులో శ్రీకాకుళం నగరంలో 'మెప్మా' ఆధ్వర్యంలో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుకు అనుమతిచ్చింది. మునిసిపాలిటీ, బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు రుణాలిచ్చి దుకాణాలు ఏర్పాటు చేయిస్తారు. వంద దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు గాను రూ.4.5 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

పొందూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పతి వాడ ఆనంద్(60) మంగళవారం రాత్రి మృతి చెందారు. 10 రోజుల కిందట బ్రెయిన్‌స్ట్రోక్ రావ డంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆనంద్ మృతిపట్ల ఎంఎల్ఏ కూన రవికుమార్, కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు, నేతలు రామ్మోహన్, శంకరభాస్కర్, రాము సంతాపం తెలిపారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎంపికలకు దరఖాస్తులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నుకు నేందుకు 2025-26, 2026-27 సంవత్సరాలకు గాను దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధి కారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులు (ఫిజికల్ డైరెక్టర్లు), వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకో వచ్చన్నారు. వీరికి వయస్సు 58 సంవత్సరాల లోపు ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉన్నవారు బయోడేటా పూర్తి చేసి డీఈవో కార్యాలయంలో ఆగస్టు 3వ తేదీలోగా అందించాలని కోరారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ నిర్వాకం

- తాడివలస రైతులకు అందని యూరియా
- ఆందోళన చెందుతున్న రైతులు

పొందూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తాడివలస సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ నిర్వాకంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా ఇండెంట్‌కు నగదు చెల్లించక పోవడంతో గ్రామానికి యూరియా మంజూరు కాలేదు. తాడివలస పంచాయతీ పరిధిలో తాడివలస లత్సయ్యపేట, గుండ్రేడు గ్రామాల్లో 1,800 మంది రైతులున్నారు. సకాలంలో వర్షాలు కురవడం, నారాయణపురం కాలువనీరు విడుదల చేయడంతో రైతులు వరి ఎదలు వేశారు. అయితే సకాలంలో పంటకు యూరియా వేయాల్సి ఉన్నా అందలేదు. గతంలో సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేసి బదిలీ అయిన బొడ్డేపల్లి లావణ్య యూరియాకు ఇండెంట్ పెట్టకపోవడం, నగదు చెల్లించలేదు. దీంతో మండలంలో అన్ని గ్రామాలకు యూరియా వచ్చిందని, మా గ్రామానికి మాత్రమే రాలేదని తాడివలస రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందారు. వ్యవసాయాధికారుల తీరుపై సర్పంచ్ తమ్మినేని మనెమ్మ, రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ను ఎలా రిలీవ్ చేశారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే గ్రామానికి యూరియా సరఫరా చేస్తామన్నారు.

రెగ్యులర్ వార్డెన్ లేకపోతే ఎలా?

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బీసీ మెట్రిక్ బాలుర వసతిగృహాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉండి చదువుకుంటున్నారు. అయితే ఇక్కడ వార్డెన్ ఎవరని విద్యార్థులను ఎన్ఈఆర్ అడుగగా ఎక్కువ మంది తెలియదంటూ సమాధానమిచ్చారు. ఇటీవలు వార్డెన్ల బదిలీలు జరగ్గా ఇక్కడికి బదిలీ అయిన వ్యక్తి తన పలుకుబడిని ఉపయోగించి డిప్యూటేషన్‌పై కంచిలి మండలం ఎంఎస్ పల్లి బీసీ వసతి గృహానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎన్ఈఆర్ 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచిలి మండలానికి ఎలా డెప్యుటేషన్ వేశారని ఆశ్చర్యపోయి.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, రెగ్యులర్ వార్డెన్ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'కిల్కారి' సేవలను సద్వినియోగం చేసుకోండి

- ప్రోగ్రాం జాతీయ అధికారి కె.మౌనిక

అరసవల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 'కిల్కారి' పథకం సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం జాతీయ అధికారి కె.మౌనిక అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ పథకంపై బుధవారం జిల్లా స్థాయి ఆశ నోడల్ అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన కిల్కారి ఫోన్ కాల్స్ గర్భిణులు వినాలని కోరారు. మాతా, శిశు మరణాల నివారణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గర్భిణి 4వ నెల మొదలుకుని బిడ్డకు సంవత్సరం వచ్చే వరకు ఈ కాల్స్ వారానికి ఒకసారి వస్తాయని, ఈ కాల్ సమయం కేవలం రెండు నిమిషాలే ఉంటుందన్నారు. నెంబర్ ను ముందుగా సేవ్ చేసుకోవాలని, మరలా సమాచారాన్ని వినాలంటే 14423 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఆశ నోడల్ ఆఫీసర్లు అందరూ వారి పరిధిలోని పీహెచ్‌సీల్లో ఆశ, ఏఎన్ఎంల ద్వారా ఈ కిల్కారి సేవలపై గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిం చాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ రాందాస్, డీపీహెచ్ఎన్‌వో శైలజ, డీసీఎం రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో జలకళ


వమరవెల్లి కాలువలో ప్రవహిస్తున్న నీరు

గార, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు పనులు చేపట్టిన నేపథ్యంలో జలకళ కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు సాగునీటి కాలువ ల్లో సాగునీటి సంఘాల ద్వారా పూడిక తొలగించే పనులు చేపట్టారు. దీంతో కాలువల్లోకి నీరు చేరడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2న ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఆగస్టు 2న ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక, సాంఘిక, జానపద నాటక ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సమాఖ్య కార్యాలయంలో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో 33 మంది కళాకారులు హరిశ్చంద్ర, విశ్వామిత్ర, నక్షత్రక, శిశుపాలుడు తదితర పౌరాణిక నాటక ఏకపాత్రాభినయం చేయనున్నారన్నారు. సమావేశంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, రామచంద్రదేవ్, రమణారావు, పన్నాల నరసింహమూర్తి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి: డీపీవో

జి.సిగడాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డీపీవో సౌజన్య అన్నారు. గత కొన్ని రోజుల కిందట గ్రామంలో జ్వరాలు, కీళ్ల నొప్పులతో పలువురు బాధపడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం టీడీ వలసను ఆమె సందర్శించారు. గ్రామంలో వీధులు, నివాసాల మధ్య పెంట కుప్పలు లేకుండా తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు తదితరులున్నారు.

ఎచ్చెర్ల బాట్లింగ్ యూనిట్‌ను విడదీయొద్దు

ఎచ్చెర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాట్లింగ్ యూనిట్‌ను విడదీయవద్దని హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఈ డిపోను విడదీసే ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. హమాలీ యూనియన్ నాయకులు పి.రామారావు, నిడిగింట్ల రమణ, బోనెల రాము, పట్నాల రామారావు పాల్గొన్నారు.

4న ఆదిత్యాలయ హుండీల లెక్కింపు

అరసవల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి హుండీలను ఆగస్టు 4వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కేఎన్‌వీడీవీప్రసాద్ తెలిపారు. ఆలయ అనివెట్టి మండపంలో అనువంశిక ధర్మకర్త, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు.

తాగునీరు కలుషితం!

- శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు
- పొంచి ఉన్న వ్యాధులు
- పట్టించుకోని యంత్రాంగం

నరసన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోకపోవడం ఇటీవల అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నియోజవర్గంలో 124 పంచాయతీల్లో 80పైగా పంచాయతీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో ఐదారు పంచాయతీల్లో మాత్రమే నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేస్తున్నారు. మిగతా గ్రామ పంచాయతీల్లో ఎటువంటి క్లోరినేషన్ చేపట్టకుండా తాగునీరు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల వర్షాలు పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ద్వారా బురదనీరు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన నిర్వహణను పంచాయతీలకు, సీపీడబ్ల్యూఎస్ పథకాలు నిర్వహణను ఆర్థిక సంఘం నిధులతో నిర్వహణ చేపడుతున్నారు. పలు గ్రామ పంచాయతీల్లో ఓవన్‌హెడ్ ట్యాంకులను నిచ్చెనలు లేకపోవడంతో శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంటుంది. బ్లీచింగ్ సున్నంతో శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. మైనర్ పంచాయతీల్లో ఒక్కో ట్యాంకు ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.500 నుంచి రూ.1,000, మేజర్ పంచాయతీల్లో రూ.1000 నుంచి రూ.1,500 వరకు ఖర్చు చేస్తున్నట్టు లెక్కల ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే నియోజవర్గంలో నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోకపోవడం లేదు. దీంతో కలుషిత నీరు సరఫరా కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి వాటర్ ట్యాంకులను శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి రక్షిత తాగునీటిని అందించి వ్యాధుల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


శుభ్రతకు నోచుకోని జగన్నాథపురం ఓవర్ హెడ్ ట్యాంకు

తండ్రి చితికి తలకొరివి పెట్టిన కుమార్తె


దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె అనురాధ

సరుబుజ్జిలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నందికొండ గ్రామంలో బుధవారం తండ్రి చితికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూన సింహాచలం (65) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వైకుంఠరావు కూడా ఇటీవల ఇదే వ్యాధి బారినపడ్డాడు. ఈ క్రమంలో సింహాచలం బుధవారం మృతి చెందడంతో అంత్యక్రియలు చేసే స్థితిలో కుమారుడు లేకపోవడంతో చిన్న కుమార్తె అనురాధ (పురుషోత్తపురం) తండ్రి చితికి తలకొరివి పెట్టింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఎచ్చెర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట పంచాయతీ కింతల్లిమిల్లు జంక్షన్‌లో నివాసం ఉంటున్న కూటికుప్పల రత్నాలమ్మ (76) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న రత్నాలమ్మ ఈనెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం రిమ్స్‌లో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రత్నాలమ్మ కుమారుడు దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

పశువులు పట్టివేత

ఎచ్చెర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను నవభారత్ జంక్షన్ వద్ద హైవేపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఒక వాహనంలో 13, మరో వాహనంలో 17 దూడలను తరలిస్తుండగా పట్టుకుని ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పశువులను విజయనగరం జిల్లా గుర్లలోని గో సంరక్షణా కేంద్రానికి తరలించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వీఆర్ఏ అక్రమాలపై విచారణ

ఎల్ఎన్ పేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): జొర్రంపేట గ్రామానికి చెందిన వీఆర్ఏ ఎస్.దుర్గారావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్టు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ.. వీఆర్ఏగా దుర్గారావు మల్లిఖార్జునపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని కొంత భూమికి సంబంధించిన రికార్డులను చనిపోయిన వ్యక్తి పేరుమీద దుర్గారావు టాంపరింగ్ చేసినట్టు కె.శ్యాంసుందరరావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని, దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. ఈ భూములు చేతులు మారడంపై వీఆర్ఏ దుర్గారావు కీలకంగా వ్యవహరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. దుర్గారావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించనున్నట్టు తెలిపారు.

మునిసిపల్ కార్మికులపై లాఠీచార్జి తగదు


నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

కాశీబుగ్గ, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోరుతూ గత 18 రోజులుగా సమ్మెచేస్తున్న నెల్లూరు మునిసిపల్ కార్మికులపై పోలీసులు లాఠీచార్జి చేయడం సరికాదని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్మిక సంఘ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు మస్టర్ పాయింట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, వెంకట్, శంకర్ మాట్లాడుతూ.. వర్క్ కాంట్రాక్ట్ విధానం పూర్తిగా మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, బాస్కరరావు, కూర్మారావు, బాలకృష్ణ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి మాధురి

పలాస, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా భయంకరమైందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ.. వివిధ కారణాల వల్ల బాలబాలికలు అక్రమ రవాణాకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలల సంరక్షణకు టోల్‌ఫ్రీ నెంబరు 1098ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వయ్యాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు టీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, ప్రభుత్వ న్యాయవాది పిండి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు పేరుతో ఉద్దానాన్ని నాశనం చేయొద్దు



నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

వజ్రపుకొత్తూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో ఉద్దాన ప్రాంతాన్ని నాశనం చేయొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కార్గోఎయిర్‌పోర్టు వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి మద్దతుగా బుధవారం ఆయన ఒంకులూరు గ్రామంలో ర్యాలీలో పాల్గొని అనంతరం విలేకరుతో మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా బలవంతపు భూ సేకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యమానికి వ్యతిరేకంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడితే ప్రజా ఉద్యమమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, న్యూడెమ్రక్రసీ వంకల మాధవరావు, లిబరేషన్ మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలి

కొత్తూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వసప వద్ద వంశధార నదిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక తవ్వకాలను తక్షణం నిలుపుదల చేయాలని తహసీల్దార్ కె.బాలకృష్ణ ఆదేశించారు. వసప వద్ద ఇసుక ర్యాంపు రవాణాపై రైతులు ఆందోళన చేసి నేపథ్యంలో ఇసుక తవ్వకాలు చేయొద్దన్నారు. బలద రెవెన్యూ పరిధిలో ఇసుక ర్యాంపుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఉన్నాయని, అందువల్ల వసప ఇసుక ర్యాంపు నుంచి త్వకాలు చేయొద్దన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన పదవిని బాధ్యతగా భావించి రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకాంక్షించారు. బుధవారం నిర్వహించిన పలాస పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆమె పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రైతులు అన్ని విధాలుగా దగాపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత వంశధార కాలువల మరమ్మతులు చేయించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చేశామన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్‌గా వంకల కూర్మారావుచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరికట్ల విఠల్‌రావు, కుత్తుమ లక్ష్మణరావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబు చౌదరి, గాలి కృష్ణారావు, పీఏసీఎస్ సభ్యులు ఆర్.సుదర్శనరావు, బి.దుష్యంత్ పాల్గొన్నారు.

రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు చేపట్టాలి


మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు పాలకవర్గం చేపట్టాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. బుధవారం కొసమాల పీఏసీఎస్ అధ్యక్షుడిగా సలాన మోహనరావు ప్రమాణ స్వీకారానికి హాజరై ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయ పెట్టుబడులకు వాడిన రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీలను నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో కొత్తూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, టీడీపీ నాయకులు అగతముడి బైరాగినాయుడు, అగతముడి మాధవరావు, మాతల గాంధీ, దినకరావు, లక్ష్మీనారాయణ, అనపాన రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 కుటుంబాలకు సీఎం సహాయనిధి అందజేత


బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/ పోలాకి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 12 కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందచేశారు. పోలాకి గ్రామానికి చెందిన గూనపుజ్యోతికి రూ.83,311, జెలమర పాలవలసలకు చెందిన గొర్లె ఆకాష్‌కు రూ.30,000, బెల్లాయివలసకు చెందిన బమ్మిడి రోహిణికి రూ.21,600, గుప్పెడుపేటకు చెందిన మంకు శ్రీనుకు రూ.41,580, మడపాం గ్రామానికి చెందిన తాండ్రపు గున్నమ్మకు రూ.10,2620, బుచ్చిపేటకు చెందిన కొన్న భువనేశ్వర్‌కు రూ.2,83,399, గేదెల రమణమూర్తికి రూ.40,610, వడ్డి కావ్యకు రూ.1,37,784, పొట్నూరు సంధ్యారాణికి రూ.15,000, శాసనాపురం దానేశ్వరరావుకు రూ.30,000, మెండ నరసమ్మకు రూ.45,895, సారవకోట మండలం డోల రోహిణికి రూ.23,400 చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, నరసన్నపేట మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, నాయకుడు గొద్దు చిట్టిబాబు, బలగ ప్రహర్ష, గోపి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి


స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీనమైన పెద్దపాడు పంచాయతీలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంతో పాటు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన పొందరవీధి, రామాలయం వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను, తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక మహిళలు ఫిర్యాదుచేశారు. రెండు రోజుల్లో మళ్లీ వస్తానని, తక్షణం సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీడీ ప్రసాద్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జానకి పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో క్రీడా పోటీలు ప్రారంభం


పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో బుధవారం న్యాయవాదుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ఈ పోటీలను ప్రారంభించారు. బుధవారం చదరంగం, క్యారెమ్స్ పోటీలు జరిగా యి. కార్యక్రమంలో న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీనివాస్, ఎం.ఫణికుమార్, జన్నత్ బేగమ్, జి.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావు, సీనియర్ న్యాయవాదులు ఎన్ని సూర్యారావు, పొన్నాడ రమణారావు, జల్లు తిరుపతిరావు, కొంగు రమణమూర్తి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌సీ గేటు విరిగి ఒకరికి తీవ్ర గాయాలు


గేటు వద్ద బారులు తీరిన వాహనదారులు

ఇచ్ఛాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎల్‌సీ రైల్వే గేటు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. రత్తకన్న నుంచి లగేజ్ వ్యాన్ టెంట్ సామాన్లతో వస్తుండగా అదే సమయంలో ఎల్‌సీ గేట్ వేసి ఉంది. రైలు వెళ్లిన వెంటనే గేట్ మెన్‌గేట్‌ను ఎత్తాడు. వెంటనే ఆటో గేటు దాటి వస్తుండగా గేట్ విరిగి ఆటోపై పడింది. అటుగా వస్తున్న దేవులమద్ది గ్రామానికి చెందిన మహిళపై విరిగిన గేటు పడడంతో ఆమె తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె తలపై 10 కుట్లుపడ్డాయి. ప్రస్తుతం కోలుకుంటోంది. గేటు విరిగిపోవడంతో కర్రను అడ్డుపెట్టారు. తర్వాత రైళ్ల రాకపోకలు సాగాయి. దీంతో గంటపాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. రైల్వే సిబ్బంది గేటును బాగుచేశారు. రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే గేటు విరిగిపోయి ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

వచ్చే నెలలో టెక్కలిలో మెగా శానిటేషన్ డ్రైవ్

టెక్కలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రతకు నెలవైన టెక్కలిలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఆగస్టులో నెలరోజులపాటు మెగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించేందుకు పంచాయతీ కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 77చోట్ల కాలువల్లో భారీగా పూడికతీతలు, జంగిల్ క్లియరెన్స్ చెత్తకుప్పలు తొలగించాలని ఇప్పటికే గుర్తించారు. అయితే 37వేలు జనాభా పైన గల టెక్కలి పంచాయతీ పరిధిలో 140కు పైగా వీధులు ఉండడం, చాలీచాలని పారిశుధ్య కార్మికులతో నెట్టుకొస్తున్నారు. మొత్తం ఎనిమిది మంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు, 40మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు, 18మంది ఒకపూట పనిచేసే క్లాప్ మిత్రాలు పనిచేస్తున్నారు. అయితే టెక్కలిలో జనాభా ప్రాప్తికి మరో 30మంది పారిశుధ్య కార్మికులైనా అవసరం ఉంది. కంద్రవీధి, మెట్టవీధి, ఆదీఆంధ్రా వీధి, చేరివీధి, బ్రాహ్మణవీధి, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, మెయిన్‌రోడ్డు, జడ్పీ రోడ్డు, తెంబూరురోడ్డు, చిన్నబజారు, కొండ్రవీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ దరి, పాతజాతీయ రహదారి, నాలుగురోడ్ల కూడలి, ఇందిరాగాంధీ జంక్షన్ ఇలా గుర్తించిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. అయితే ఇది ఎంతవరకు అమలు చేస్తారో వేచిచూడాల్సిందే.

వ్యాపారవేత్తలు భాగస్వామ్యం కావాలి

నరసన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావాలని నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన సూచించారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పీ-4 కార్యాక్రమంపై అవగాహన నిర్వహించారు. పట్టణంలో నిరుపేదలను ప్రభుత్వ మార్గదర్శికాలను అనుగుణంగా గుర్తించాలన్నారు. పేదలు అభ్యున్నతకు వ్యాపారవేత్తలు దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఈవో ద్రాక్షాయిణి, ఉప సర్పంచ్ సాసువల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతపాఠశాల ప్రహరీ నిర్మాణానికి వితరణ

జలుమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ఉన్నతపాఠశాల ప్రహరీ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు ఆనెం యోగీశ్వరరావు రూ.10 వేలు వితరణగా అందించారు. బుధవారం పాఠశాల హెచ్ఎం నిర్మలాదేవికి నగదు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

నందిగాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండో విడతగా చేపట్టనున్న సుమిత్వ సర్వేపై సచివాలయ ఉద్యోగులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ సర్వేయర్లకు ఈ శిక్షణ నిర్వహించారు. మండలంలోని 45 గ్రామాల్లో చేపట్టనున్న సర్వేపై డిప్యూటీ ఎంపీడీవో టి.రాజారావు పలు అంశాలపై వివరించారు. టీవోటీ సుకన్య సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.సంతోష్‌కుమార్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

టెక్కలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ సహాయకులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు చట్టం విధివిధానాలు, ఆవశ్యకతపై వివరించారు. సమాచార హక్కు చట్టంపై వచ్చిన అర్జీలపై అత్యంత ప్రాధాన్యత క్రమంలో సమాచారం అందించాలని సూచించారు. పంటల బీమా ప్రీమియంను అధిక శాతం రైతుల నుంచి కట్టించేలా చూడాలని, పంట నమోదు ప్రక్రియ చేపట్టాలని ఈ సందర్భంగా వీఏఏలకు వివరించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

పాతపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ఓటరల జాబితా తయారు చేయడం జరుగుతుందని తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు, తొలగింపులలో వివాదాలకు తావివ్వకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయపార్టీలనాయకులు బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దీక్షాదారుల వితరణ

పోలాకి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పోలాకి మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, దీక్షాదారులు బుధవారం అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పైల అప్పన్న ఆధ్వర్యంలో ప్రతీ బుధవారం పేదలకు అన్న వితరణ ఉంటుందన్నారు. దాతలిచ్చిన విరాళాలు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో అన్న వితరణ కార్యక్రమం చేపడుతున్నామని ఎంపీటీసీ తూలుగు అశోక్ తెలిపారు. అయ్యప్పస్వామి దీక్షలకు ఆలయాన్ని సిద్ధంచేస్తున్నామని గురుస్వామి తెలిపారు.

శక్తియాప్ అవగాహన కలిగి ఉండాలి

పాతపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): శక్తియాప్ వినియోగంపై ప్రతీఒక్కరూ అవగాహన కలి గుండాలని టెక్కలి డివిజన్ శక్తిఇన్‌చార్జి గిరిధర్ అన్నారు. తెంబూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో శక్తియాప్‌పై అవగాహన కల్పించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతశ్రీకాకుళం/ జలుమూరు/ సారవకోట/ పాతపట్నం/ పొందూరు/ ఎచ్చెర్ల/ రణస్థలం/ ఆమదాలవలస, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆర్‌డీఎస్ఎస్‌లో భాగంగా వివిధ ఫీడర్ల పరిధిలో పనులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈలు నరసింహకుమార్, పి.యోగేశ్వరరావు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రణస్థలం పరిధిలో కోష్ఠ, పిషిణి, వెంకటరావుపేట, వల్లభరావుపేట, దేరసాం, లావేరు పరిధిలో ఆదపాక, గుర్రాలపాలెం, బైదయ్యవలస, పెద్దకొత్తపల్లి, ఎచ్చెర్ల పరిధిలో కొయ్యాం, జర్జాం, ఎస్ఎం పురం, బడివానిపేట, ఫరీదుపేట, కేకే నాయుడుపేట, మెళియాపుట్టి పరిధిలో చిన్నహంస, తిదిమి, మెళియాపుట్టి, కోటబొమ్మాళి పరిధిలో అక్కుపల్లి, సరియాపల్లి, దొంత, పోలాకి పరిధిలో ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, డోల, పోలాకి, ఉర్లాం, ఎస్ఎల్ పురం, గొల్లలవలస, తోటాడ, సునరాం, నరసన్నపేట పరిధిలో నడగాం, సుందరాపురం, బోడవరం, వెంకటాపురం, కవిటి పరిధిలో డీజీ పుట్టుగ, కుసుంపురం, మాణిక్య పురం, దూగానపుట్టుగ, సరుబుజ్జిలి పరిధిలో రొట్టవలస, ఆమదాలవలస పరిధిలో జీకే వలస, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, సీపన్నపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. జలుమూరు పరిధిలో చల్లవానిపేట, జలుమూరు, శ్రీముఖలింగం, అంధవరం, కొమనాపల్లి, యలమంచిలి, అక్కురాడ, చెన్నాయవలస, అచ్యుతాపురం, నగిరికటకం, శ్రీముఖలింగం, కరకవలస, బైదలాపురం, సురవరం, తిమడాం, పర్లాం, మాకివలస, రామకృష్ణాపురం, అంధవరం, జోగులపేట తదితర గ్రామాలకు, సారవకోట పరిధిలో మదనాపురం, జమ్మిచక్రం, కిడిమి పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. పాతపట్నం పరిధిలో మేజర్ పంచాయతీ పాతపట్నం టౌన్, దశరధపురం, తిడ్డిమి సూర్య నారాయణపురం, రంకిణి, చంగుడి, సరాళి, గోపాలపురం, కొరసవాడ, బూరగాం, బోరుభద్ర, సీతారాంపల్లి, కాగువాడ, కమలమ్మకొట్టు కూడలి, బగడల, గురండి, పొందూరు మండలం లోలుగు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడి

హరిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ పలాస ఏడీ ఎం.రామారావు అన్నారు. మందస మండలం మకరజోల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఏఈవో ఉదయ్, జ్యోత్స్న, బమ్మిడి కర్రయ్య, వి.మాధవరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

వజ్రపుకొత్తూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): డోకులపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫీలియా, క్యాన్సర్, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువత నుంచి మంచి స్పందన లభించింది. 20 మంది యువతీ యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కీలు విజయకుమార్, సర్పంచ్ వడ్డి సరితా, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, సొసైటీ ప్రతినిధులు కీలు కమల, శాంతి, కేశవ తదితరులు ఉన్నారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందన

హిరమండలం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లోడుపేట గ్రామానికి చెందిన కోర్ను వంశీకృష్ణ ఈ ఏడాది నీట్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ 12,392 సాధించడంపై రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు బుధవారం అభినందించి సత్కరించారు. కల్లట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, జి.సింహాచలం, టి.తిరుపతిరావు, ఎల్.లీలావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంట్లోని వస్తువులు ధ్వంసం


చిందర వందరగా పడివున్న సామగ్రి

ఇచ్ఛాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బాసి భారతి ఇంటికి తాళాలు వేసి బంధువులు ఇంటికి వైజాగ్ వెళ్లారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెరటి వైపు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి వస్తువులన్నీ చిందర వందర చేశారు. ఇంట్లో ఉన్న బీరువా, మంచం, సోఫాలు, ఫ్రిజ్, టీవీని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వైజాగ్‌లో ఉన్న భారతికి సమాచారం ఇవ్వడంతో ఆమె బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. రాజకీయ కక్షతోనే దుండగులు ఇంట్లోకి చొరబడి సామాన్లు ధ్వంసం చేశారని, తెలిసిన వ్యక్తులే చేసి ఉంటారని ఆమె తెలిపారు. రూరల్ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మెరుగైన బోధన

నరసన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)ని ప్రారంభించిందని డిప్యూటీ డీఈవో విజయకుమారి అన్నారు. బుధవారం పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు పాఠశాల డైరీలను పంపిణీ చేశారు. గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలను 2022 సెప్టెంబరు 7న ఏర్పాటు చేసిందని ఇటీవల ఈ పాఠశాలలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేసారన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో డిజటల్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీ, లేబరేటరీ, క్రీడల్లో చైతన్య పర్చేలా ఆట స్థలాలు, కిచెన్‌గార్డెన్‌లతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పైడి వెంకట్రావు,ఎంఈవో ఉప్పాడ శాంతారావు, ఉపాధ్యాయులు బోర రాజేంద్రనాయుడు, సాయి శ్రీనివాసశర్మ, ఎంవీ రమణ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.